తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

ఆదివారం
22 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

మాడుగులపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో

పోషకాహార మాయాజాలం!

○చిన్నారుల పొట్టకొడుతున్నదెవరు? ప్రభుత్వమా.. అధికారులా?

○సరుకులు రావడం లేదంటూ సిబ్బంది చేతులెత్తివేత

○వివరణ కోరితే ఫోన్ ఎత్తని ఐసీడీఎస్ అధికారులు.. నిలువెత్తు నిర్లక్ష్యం!



మాడుగులపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి): గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ ఆశయం మాడుగులపల్లి మండలంలో నీరుగారిపోతోంది. మండలంలోని పలు గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందాల్సిన గుడ్లు, పప్పు, బియ్యం వంటి నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.సరుకులు ఎందుకు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు నిలదీస్తే.. రాష్ట్ర ప్రభుత్వం నుంచే సరుకులు రావడం లేదు అంటూ అంగన్వాడీ సిబ్బంది చేతులెత్తే స్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులది నిలువెత్తు నిర్లక్ష్యం.. ఫోన్ ఎత్తే తీరికే లేదా?అసలు సరుకులు ఎందుకు ఆగిపోయాయో తెలుసుకునేందుకు బాధ్యతాయుతమైన ఐసీడీఎస్ (ఎఅఆూ) అధికారులను ఫోన్‌లో సంప్రదించగా, కనీసం ఫోన్ ఎత్తి సమాధానం చెప్పే తీరిక కూడా వారికి లేకపోవడం గమనార్హం. ప్రజా సమస్యలపై వివరణ ఇవ్వాల్సిన అధికారులే ఇలా స్పందించకపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి అద్దం పడుతోంది. అధికారుల తీరు చూస్తుంటే అసలు లోపం ప్రభుత్వంలో ఉందా? లేక అధికారుల నిర్లక్ష్యంలో ఉందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి.

అసలు లోపం ఎక్కడ? పక్కదారి పడుతున్నాయా?

నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో సరుకులు నిలిపివేసిందా? లేక కాంట్రాక్టర్ల సరఫరా లోపమా? ఒకవేళ ప్రభుత్వం సరుకులు పంపిస్తున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మధ్యలోనే పక్కదారి పడుతున్నాయా? అన్నది ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం సరుకులు పంపకపోతే ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని ప్రజలు నిలదీస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల చిన్నారుల కడుపు కొట్టేలా వ్యవహరిస్తున్న అంగన్వాడీ సిబ్బంది, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఐసీడీఎస్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి. సరుకుల సరఫరాలో జాప్యానికి గల అసలు కారణాలను బయటపెట్టి, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సూర్యాపేట జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

సూర్యాపేట (జనంసాక్షి):

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాటం కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,సూర్యాపేట పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన సమితి పిలుపు మేరకు సూర్యాపేట పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటవార్పు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.శంషాబాద్ నుంచి చెన్నైకి గతంలో సూర్యాపేట మీదుగా

వార్తా లోపలి పేజీలో

సేవ్ వాటర్.. సేవ్ పవర్‌పై మానవహారం

ఆత్మకూర్ (ఎం) నవంబర్ (21)జనంసాక్షి

నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో శనివారం మానవహారం నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొని “సేవ్ వాటర్.. సేవ్ పవర్” అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ కంఠం పూర్ణచందర్ రాజు, గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి, లోడి శంకర్, మజ్జిగ నర్సయ్య, సామ నర్సిరెడ్డి, మజ్జిగ లక్ష్మణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

రాజీ మార్గం ద్వారా కేసులను శాశ్వతంగా పరిష్కరించుకోవాలి : అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. స్నేహ

దేవరకొండ నవంబర్ 21(జనంసాక్షి)

దేవరకొండ మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద నమోదైన చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారం కోసం శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా గౌరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. స్నేహ మాట్లాడుతూ, న్యాయస్థానాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను ఫిర్యాదుదారులు, నిందితులు పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో శాశ్వతంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని తెలిపారు. ఇరు పక్షాలు కోర్టుల చుట్టూ తిరగకుండా సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్ ఐ యాక్ట్ కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఉమామహేశ్వర్, న్యాయవాదులు ముస్తాక్ అహ్మద్, అశోక్, రమేష్, రియాజుద్దీన్, సాయి,జున్ను ఇద్దయ, తదితరులు పాల్గొన్నారు.



రైతులు ప్రభుత్వానికి సహకరించాలి

రైతు సోదరులకు ఎలాంటి నష్టం జరగకుండా బుగ్గ వాగు ప్రాజెక్టు భూసేకరణ చేపడతాం

జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం

కామేపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి): రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా బుగ్గవాగు ప్రాజెక్టు భూసేకరణ చేపడుతున్నామని రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఖమ్మం జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి. సదానందం వెల్లడించారు.



మండలంలోని బుగ్గ వాగు ప్రాజెక్ట్ నుండి తీసుకొచ్చే భూమి లోపల అండర్ గ్రౌండ్ నీటి పైపు లైన్‌వేసి దాని ద్వారా చెరువులు నింపడానికి పింజరమడుగు ,నెమలిపురి, గోవింద్రాల,పాత లింగాల, కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీలలో శనివారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ బుగ్గ వాగు నుండి వృధాగా పోతున్న నీటిని ఈ గ్రామాల్లో ఉన్న చెరువులకు నీటిని మళ్లించి వాటిని నింపి రైతులకు రెండు పంటలు పండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఇప్పటికే మండలంలో సీతారామ ప్రాజెక్ట్,బుగ్గ వాగు ప్రాజెక్ట్ ద్వారా మండలం లోని భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు.భూ సర్వేలు పూర్తయిన వెంటనే రైతు కోల్పోయిన భూములకు రావలసిన నష్టపరిహారాన్ని చెల్లిస్తామని వెల్లడించారు.ఈ భూ సేకరణ సభల్లో రైతులు లేవనెత్తిన పలు అంశాలకు వారు సమాధానం చెప్పారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సోమ్ లాల్,కొమ్మినేపల్లి సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు ఇరిగేషన్ డి ఈ వెంకన్న నాయక్. ఆర్ ఐ క్రాంతి. ఇరిగేషన్ ఏఈ లు నాగయ్య,సందీప్ వర్క్‌ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు జిపిఓ లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో ఘనంగా జనవిజ్ఞాన వేదిక(జేవీవీ)చెకుముకి మండల స్థాయి పోటీలు

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేత

చండూరు, నవంబర్ 21 (జనంసాక్షి)

చండూరు హైస్కూల్లో శనివారం జన విజ్ఞన వేదిక(జేవీవీ)చెకుముకి మండల స్థాయి పోటీలు, విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు, జ్ఞాపికల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్ రెడ్డి(టామ్ రెడ్డి), ఎస్సై శివకుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, ఎం.ఈ.ఓ సుధాకర్ రెడ్డిలు హాజరయ్యారు. వారు మట్లాడుతూ.. నమ్మకం, మూడ నమ్మకం వేరువేరు అని విద్యార్థులకు వివరించారు. తమ జీవితంలో ఎదురైన కొన్నిఘటనలను ఉదహారణగా చెబుతూ.. అందరు విజ్ఞాన వంతులు అవ్వాలని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. మూడు రోడ్ల వద్ద నిమ్మకాయలు, కోడి గుడ్లు, అన్నం తిప్పివేయటం వంటి వాటితో ఏమి కాదని, దెయ్యాలు, భూతాలు అన్ని కూడా అభూత కల్పనలు అంటు వివరించారు. ఎనకటి కాలంలో గ్రామీణ ప్రాంతలలో నిరక్షరాస్యత ఉండేదని అంధ విశ్వాసాలతో అనేక ఆచారాలు పాటించేవారని తెలిపారు. అప్పటి కాలంలో ఇంట్లోని వృద్ధులు పిల్లలు



రాత్రి వేళలో పడుకోకుండా మారాం చేస్తుంటే దెయ్యం వస్తుంది, భూతం వస్తుంది అంటు కల్లబొల్లి మాటలు చెప్పి పడుకోబెట్టేవారన్నారు. మన ఇల్లు పగడివేళలో ఎలా ఉంటుందో రాత్రి వేళలోను అలాగే ఉంటుందని కాని మనం చీకటిలో ఏదో ఉంటుందని భయపడుతామని అక్కడ ఏది ఉండదని అందంతా మన మానసిక భయాందోళనలు మాత్రమే అంటు వివరించారు. చేతబడులు, బానామతులు అన్ని ఉట్టివేనని వాటిని ఎంత మాత్రం పట్టించుకోవాల్సిన పనిలేదని తెలిపారు. భక్తి అంటే క్రమశిక్షణ అని భక్తికి మూడ నమ్మకానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఎచ్ఎమ్ కోటేశ్వర్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక(జేవీవీ)డివిజన్ అధ్యక్షుడు,సీనియర్ పాత్రికేయుడు రాపోలు ప్రభాకర్, మండల అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు సంగేపు మల్లికార్జున్, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఎస్. విజయలక్ష్మి, కళ్లెం వెంకట్‌రెడ్డి, సుధీర్‌బాబు,కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ సమాచారం కొరకు

రూ.10 వేలు అడిగి వివరణ ఇవ్వని ఎంఈవో

ఆర్టీఐ దరఖాస్తుదారుడికి చుక్కలు చూపిస్తున్న అధికారులు

అప్పీల్ గడువు ముగిసినా అందని సమాచారం :దరఖాస్తుదారుడి ఆరోపణ

జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వివరాలు కోరిన దరఖాస్తుదారుడికి సమాచారం ఇవ్వకుండా మండల విద్యాశాఖాధికారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బొమ్మ మధు ఆరోపించారు. మండలంలోని జూలూరు పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ నిధులు, ఎంఆర్సీ నిధులు, ఎంఈవో విధులు బాధ్యతలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల తనిఖీ నివేదికలు తదితర వివరాల కోసం ఆయన ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.గడువు ముగియడానికి ఐదు రోజుల ముందు స్పందించిన ఎంఈవో సమాచారం ఇవ్వకపోగా, రూ. 10 వేలు చెల్లించి సమాచారం తీసుకోవాలని లెటర్ ద్వారా తెలియజేసారని బొమ్మ మధు తెలిపారు. ఆ మొత్తానికి సంబంధించి వివరణ కోరుతూ వెంటనే దరఖాస్తు చేసినా, రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. దీనిపై మొదటి అప్పీలేట్ అధికారి డీఈవో కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఆ గడువు కూడా ముగిసిపోయిందని, అయినా సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంపీడీవో ద్వారా పలుమార్లు ఎంఈవోకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన తెలిపారు. నిధుల వివరాలను వెల్లడించడంలో అధికారులు ఇంతలా జాప్యం చేయడాన్ని బట్టి చూస్తుంటే నిధులు పక్కదారి పట్టినట్లు అనుమానం కలుగుతోందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, తనకు పూర్తి సమాచారం అందేలా చూడాలని బొమ్మ మధు కోరారు.

పేద కుటుంబానికి సీఎం సహాయనిధి అండ

రూ.52 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చండూరు, నవంబర్ 21 (జనంసాక్షి): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలు స్తోంది. ఇందులో భాగంగా పసుపులేటి బయమ్మకు మంజూరైన రూ.52,000/- విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును రెండవ వార్డు కౌన్సిలర్ భూషిపాక వాసు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయనిధి ఎంతో భరోసానిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మరింత చేయూత అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.





అక్షయ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్‌లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం..

కోదాడ, నవంబర్ 21(జనంసాక్షి):

స్థానిక నయానగర్‌లోని అక్షయ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ నందు శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి పిల్లలకు ఎంతో చక్కగా పాఠాలు బోధించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల పాత్రలను పోషించి అందరినీ ఆకట్టుకున్నారు.ప్రిన్సిపాల్ గా వర్ష, డీఈవోగా సాయి తేజ,అలాగే మరికొందరు విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించిఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఇందులో ప్రతిభ కనబరిచి పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఢ ప్రిన్సిపాల్ బి.ఎల్. నర్సింహారావు, ఇన్‌ఛార్జ్ ఎస్.కె. వీరబాబు, మరియు ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా ప్రతి కుటుంబానికి భరోసా

సర్పంచ్ దున్నా శ్రీనివాస్

నడిగూడెం (జనంసాక్షి) :

తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి భరోసానిస్తుందని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. శనివారం నడిగూడెం మండల



కేంద్రంలో నడిగూడెం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పందిరి వెంకటరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి అండగా ఉండాలని, భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ జీవిత బీమా పథకంను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు.బీమా కొరకు ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ కుమార్ మాజీ సర్పంచులు చిల్లం చర్ల సత్యనారాయణ గడ్డం మల్లేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి జూలూరు వీరాచారి, ఉపాధ్యక్షులు శ్రీరాముల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుంజా తిరుమలేష్, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, బాణాల సతీష్ కుమార్,షేక్ నాజియా రియాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తి విజయ్, గుండు గోపి,షేక్ మౌలానా, జలాలుద్దీన్,గుంజా శ్రీకాంత్, వీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి:డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 21 (జనం సాక్షి):

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన మండలాలతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో ఎం పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సమావేశమయ్యారు. దేవరకొండ నియోజకవర్గంలోని నూతన మండలాలు, మారుమూల ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు

మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

వలిగొండ, నవంబర్ 21 (జనంసాక్షి): ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ ఈత పోటీల్లో లోతుకుంట తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు వి. మణికంఠ, జి. మణికంఠ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాయిసున్నిసా బేగం, పీడీ ఐలయ్యతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో జరగనున్నాయి.







శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటు

చైర్మన్‌గా చందర్ నాయక్.. వైస్ చైర్మన్‌గా సుమన్ నాయక్

చింతపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి)

చింతపల్లి మండలం బోటిమిది తండాలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహణ, అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంతో కమిటీ బాధ్యతలను అప్పగించారు.నూతన కమిటీ చైర్మన్‌గా యన్. చందర్ నాయక్, వైస్ చైర్మన్‌గా యన్. సుమన్ నాయక్, ట్రెజరర్‌గా యన్. పాండు నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు పలువురు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు..

మల్టీపర్పస్ వర్కర్లకు ప్రమాద బీమా చేయించిన సర్పంచ్

కేవలం రూ.749తో రూ.15 లక్షల వరకు బీమా రక్షణ..

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా: సర్పంచ్ రమావత్ చిరంజీవి



పి.ఏ.పల్లి,నవంబర్ 21(జనంసాక్షి):

పి.ఏ.పల్లి మండలం అంగడిపేట గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు గ్రామ సర్పంచ్ రమావత్ చిరంజీవి ప్రత్యేక చొరవతో పోస్టల్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు.కార్మికుల సంక్షేమం,వారి కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ బీమా చేయించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమావత్ చిరంజీవి మాట్లాడుతూ.. కేవలం రూ.749 పోస్టల్ అకౌంట్ ద్వారా ప్రమాద బీమా సౌకర్యం పొందవచ్చని పేర్కొన్నారు.విధి నిర్వహణలో భాగంగా పాముకాటు,రోడ్డు ప్రమాదాలు,విద్యుత్ ప్రమాదాలు,నీటి ట్యాంకులు శుభ్రం చేసే సమయంలో పైనుంచి పడిపోవడం,మెట్లపై నుంచి జారిపడటం వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు బీమా నిబంధనలకు అనుగుణంగా రూ.15 లక్షల వరకు బీమా క్లెయిమ్ పొందే అవకాశం ఉంటుందని వివరించారు.18 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల అర్హులైన మల్టీపర్పస్ వర్కర్లు ఈ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విధి నిర్వహణలో నిరంతరం ప్రజలకు సేవలందించే పారిశుద్ధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు ప్రమాదాల నుంచి ఆర్థిక భద్రత కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. పి.ఏ.పల్లి మండలంలోని 25 గ్రామాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకొని తమ గ్రామాల్లో పనిచేస్తున్న ప్రతి మల్టీపర్పస్ వర్కర్‌కు ప్రమాద బీమా చేయించాలని కోరారు.కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ రమావత్ చిరంజీవి తెలిపారు.



కామ్రేడ్ గులాం రసూల్ ఆశయ సాధనకు పునరంకితమవుదాం: పల్లె శేఖర్ రెడ్డి

చౌటుప్పల్ నవంబర్ 21(జనంసాక్షి)

సిపిఐ మాజీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ గులాం రసూల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చౌటుప్పల్ సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో గులాం రసూల్ 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్లోరిన్ సమస్యతో అల్లాడుతున్న మునుగోడు నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గులాం రసూల్ సుదీర్ఘకాలం పాటు ప్రజలను సమీకరించి పాదయాత్ర నిర్వహించారని గుర్తుచేశారు.ప్రజా జీవితంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, రెండు సార్లు జడ్పీటీసీగా అనేక పదవులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, నాయకులు బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, దాసరి కృష్ణ, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కురంపల్లిలో చేయూత పింఛన్ల ప్రోసిడింగ్ పత్రాలు అందజేసిన సర్పంచ్ ఓర్సు పెంటయ్య



కనగల్లు, నవంబర్ 21 (జనంసాక్షి)

రాష్ట్ర ప్రభుత్వం ఆరులైన నిరుపేద ప్రజలకు కుటుంబ ఆర్థిక భరోసా కోసం మంజూరు చేసిన చేయూత పింఛన్ల పత్రాలను శనివారం మండలంలోని కురంపల్లి గ్రామపంచాయతీలో స్థానిక సర్పంచ్ ఓర్సు పెంటయ్య 24 మంది పింఛన్దారులకు పత్రాలను అందజేశారు.. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఓర్సు పెంటయ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో అరులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా పింఛన్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. పనిగట్టుకుని ప్రభుత్వంపై అపనిందల మోపే నాయకుల మాటలు ప్రజలు నమ్మవద్దని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్లను విడతలవారీగా ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలం లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఏమి రెడ్డి రాజేందర్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గుర్రంపోడు మండలంలోని చెరువులు, కుంటలను నింపేలా ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి చొరవ చూపాలి

మూగజీవాల తాగునీటి కష్టాలు తీర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ విజ్ఞప్తి

గుర్రంపోడు :నవంబర్ 21 (జనంసాక్షి)

గుర్రంపోడు మండలంలోని చెరువులు, కుంటలను నింపి మూగజీవాలకు తాగునీటి సౌకర్యం కల్పించేలా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి చొరవ చూపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ కోరారు.గుర్రంపోడు మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, పలు చెరువుల విషయంలో సానుకూల స్పందన వచ్చినప్పటికీ, ఒక చెరువు విషయంలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి చెరువును నింపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం నీటి కొరతతో మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు తాగునీరు అందించడంలో చెరువులు, కుంటలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చెరువులు నిండితే పశువులకే కాకుండా రైతులకు, గ్రామీణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు.మూగజీవాల నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి స్పందించి గుర్రంపోడు మండలంలోని మిగిలిన చెరువులు, కుంటలను సైతం నింపేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ కోరారు.



సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుతాం



సూర్యాపేట(జనంసాక్షి):

సూర్యాపేట మీదుగానే బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఉండాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ ప్లై ఓవర్ వద్ద ది సూర్యాపేట ఇంజనీరింగ్ వర్క్స్ అండ్ ఎలక్ట్రికల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధించుకోవడం మన హక్కుగా భావించి ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ సాధించుకునే వరకు ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమాన్ని బాధ్యతగా భావించాలని కోరారు.ఎన్నో ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న పోరాటపటిమ గల సూర్యాపేట ప్రజలకు బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం పెద్ద పని కాదని అన్నారు.అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తో మరింత గుర్తింపు వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ సాధన సమితి కో కన్వీనర్ పెద్దిరెడ్డి రాజా, పెద్దిరెడ్డి గణేష్,రమణాచారి, నేరేళ్ల మధు, పెద్దిరెడ్డి కళ్యాణ్, కృష్ణ, ఆ సంఘ పట్టణ అధ్యక్షులు మాద శాంతయ్య, ట్రెజరర్ బహురోజు నాగేశ్వరాచారి, గౌరవ అధ్యక్షులు సత్తిరెడ్డి, మారోజు మల్లాచారి, యాదయ్య, రామ్ సింగ్, లక్ష్మణ్ సింగ్, పత్తిపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై జరిగిన దాడి అమానుషం

నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి..

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జెర్రిపోతుల ధనంజయ డిమాండ్



చండూరు, నవంబర్ 21 (జనంసాక్షి)

నల్లగొండలో విధి నిర్వహణలో ఉన్న దళిత పారిశుద్ధ్య కార్మికురాలు చందుపట్ల రమణమ్మపై జరిగిన దాడి అత్యంత హేయమైన, అమానవీయ చర్య అని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జెర్రిపోతుల ధనంజయ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం చండూరులో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులపై దాడులు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. బాధితురాలు రమణమ్మకు తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిని అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం పటిష్టమైన రక్షణ కల్పించాలని, దాడులు పునరావృతమైతే జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణుల పిలుపు

- ఓట్ బచావో.. దేశ్ బచావో ఫేజ్-3 కార్యక్రమంలో పాల్గొన్న పినపాక నియోజకవర్గ నాయకులు

బూర్గంపహాడ్ నవంబర్ 21 (జనంసాక్షి)

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ఓటు హక్కును కాపాడుకోవాలని, ఓటరు జాబితాలో ప్రతి ఓటు సక్రమంగా నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నియోజక వర్గం లోని మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఓట్ బచావో.. దేశ్ బచావో (వీబీడీబీ) ఫేజ్-3 కార్యక్రమంలో పాల్గొన్నారు. అశ్వారావుపేట నియోజ కవర్గంలోని గండుగులపల్లి గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి ఏఐసీసీ పరిశీలకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓట్ బచావో కార్యక్రమ ఇన్‌చార్జి వేగి వెంకటేష్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ.. ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటంలో భాగంగా తొలి



రెండు దశల్లో బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. మూడో దశలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఎల్ఏలను ఓట్ రక్షకులుగా నియమించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓట్ రక్షక్ యాప్‌లో లాగిన్ అయి ఓటరు జాబితాను నిరంతరం పరిశీలించాలని, ఎలాంటి అపకతవకలకు తావులేకుండా ప్రతి ఓటును కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, పినపాక మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, ఆళ్లపల్లి మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, గుండాల మండల అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు, మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కామ్రేడ్ గులాం రసూల్ ఆశలను సాధిద్దాం

సంస్థాన్ నారాయణపురం. నవంబర్ 21.(జనంసాక్షి):

సిపిఐ మాజీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ గులాం రసూల్ గారి 11వ వర్ధంతి నారాయణపురం సిపిఐ కార్యాలయం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హాజరైన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య గారు మాట్లాడుతూ గులాం రసూల్ గారి లేని లోటు ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు కమ్యూనిస్టు పార్టీని ఈ ప్రాంతంలో బలమైన శక్తిగా నిలబెట్టడంలో ఆయన పాత్ర చాలా ఉన్నదని అదేవిధంగా ప్రజా ప్రతినిధిగా 30 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ జీవితం లో మునుగోడు నియోజకవర్గం ప్రజలకు త్రాగు, సాగునీరు కావాలని సుదీర్ఘకాలంగా ప్రజలను సమీకరించి పాదయాత్రలు మరియు ధర్నాలు పీకటింగులు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించాలని అదేవిధంగా రాచకొండ ప్రాంతంలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజిని రాకుండా చేయడంలో విజయం సాధించారని గిరిజన తండాలకు మరియు హరిజనులకు ఇండ్లు ఇళ్ల స్థలాల కొరకు ప్రభుత్వం తో కొట్లాడి ఇప్పించిన చరిత్ర కామ్రేడ్ రసూల్ గారికి ఉన్నదని ఆయన గుర్తు చేశారు. విద్యార్థి సంఘం నుంచి మొదలైన ఆయన ప్రస్థానం కమ్యూనిస్టు పార్టీలో అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్గా ఎన్నికై అనారోగ్యంతోనే మరణించడం జరిగింది. భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన కళలు కన్న సమాజం కొరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య , మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సుర్వి నర్సింహ, పందుల యాదగిరి,సింగ పంగ రమేష్ ,పల్లె గోపాల్ రెడ్డి, మొగుదాల సత్తయ్య, కొండూరి స్వామి, శనిగల జంగయ్య, కట్ట మహేందర్, పల్లె రాములు, పబ్బు మారయ్య, సూరేపల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి

పి.ఏ.పల్లి,నవంబర్ 21(జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం గుడిపల్లి గ్రామంలో ప్రారంభమైంది. శనివారం గుడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీ వివరాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో బీమా నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి తహసీల్దార్ మధుహాసిని,మండల విద్యాధికారి శ్రీనయ్య,ఉప సర్పంచ్ అర్పపల్లి శ్రీనయ్య,పంచాయతీ కార్యదర్శి విజయ్ రెడ్డి,గ్రామ



పాలకవర్గ సభ్యులు,పంచాయతీ సిబ్బంది,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సవాలును స్వీకరించారు.. సురక్షిత ప్రసవం చేశారు!

పెద్దాసుపత్రులకు దీటుగా.. పాల్వంచ సిహెచ్ సి లోనే

విజయవంతమైన హైరిస్క్ ప్రసవం! తల్లీబిడ్డ క్షేమం..

వైద్య బృందానికి డి సి హెచ్ ఎస్ అభినందనలు.

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 21(జనంసాక్షి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (అఊఅ) వైద్యులు సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యంతో అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. పలు



ఆరోగ్య సమస్యలతో కూడిన హైరిస్క్ గర్భిణికి అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడారు.

వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలానికి చెందిన 25 ఏళ్ల శిరీష మొదటి కాన్పు కోసం , పాల్వంచ అఊఅకి వచ్చింది.ఆమెకు థైరాయిడ్ సమస్య, గర్భధారణ సమయంలో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వంటి సమస్యలతో పాటు 115 కిలోల అధిక శరీర బరువు కూడా ఉంది. అంతేకాకుండా కడుపులోని శిశువు కూడా అధిక బరువుతో ఉండటంతో వైద్యులు ఈ కేసును హైరిస్క్‌గా గుర్తించారు.

సాధారణంగా ఇలాంటి క్లిష్టమైన కేసులను మెరుగైన వైద్య సదుపాయాలున్న పెద్ద ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అయితే ఈ కేసును పాల్వంచ అఊఅలోనే నిర్వహించేందుకు ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. కేసులోని ప్రమాదాలను అంచనా వేసి, పరస్పర సమన్వయంతో బాధ్యతగా ముందడుగు వేసి ఈ సవాలును స్వీకరించారు. అవసరమైన వైద్య ఏర్పాట్లతో తమ వైద్య బృందంతో కలిసి విజయవంతంగా అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు.వారి సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యం, సమన్వయంతో 3.25 కిలోల బరువున్న ఆడ శిశువు సురక్షితంగా జన్మించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.

సాధారణంగా ఉన్నతస్థాయి ఆసుపత్రులకు పంపించే ఇలాంటి క్లిష్టమైన కేసును స్థానిక అఊఅలోనే స్వీకరించి, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్‌తో పాటు మొత్తం వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి (ఆఅఊ) డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరావు ప్రత్యేకంగా అభినందించారు.

పెద్దాసుపత్రులకు దీటుగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వంటి చిన్న ఆసుపత్రులలో సైతం నాణ్యమైన ప్రసూతి వైద్యం, అత్యవసర శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మాకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి అంటే నమ్మకం ..

అందుకే ఇక్కడ ప్రసవం- కుటుంబ సభ్యులు

మా కుటుంబం లో చాలా మంది పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగిందనీ, కోవిడ్ సమయంలో సైతం ఇక్కడే మా కుటుంబ సభ్యుల కు కాన్పు సురక్షితంగా చేశారని. అందుకే రక్తపోటు , మధుమేహం , అధిక బరువు, మొదలగు సమస్యలు ఉన్న కూడా నమ్మకం తో వచ్చామని, మా నమ్మకాన్ని వమ్ము కాకుండా వైద్యులు సురక్షిత ప్రసవం చేశారని భర్త శశి



కాంత్ తెలిపారు. 20 ఏళ్ల క్రితం తను కూడా ఇక్కడే ప్రసవం చేపించుకున్నానని, ఇప్పుడు తన కూతురు సైతం పాల్వంచ ఆసుపత్రిలో ప్రసవం జరగడం ఆనందంగా ఉందని,ఆసుపత్రి వైద్యులకి, సిబ్బందికి మా కుటుంబం రుణపడి ఉంటామని శిరీష తల్లి భాగ్యమ్మ తెలిపారు.

గిరిజనులకు విశిష్ట సేవలందించిన సున్నం రాంబాబు

- ఉన్నత పదవులు అధిరోహిస్తూ మరింత సేవలందించాలి: ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆకాంక్ష

భద్రాచలం నవంబర్ 21 (జనంసాక్షి)

ఐటీడీఏ పరిపాలన అధికారిగా సున్నం రాంబాబు అందించిన సేవలు ప్రశంసనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో పదోన్నతులు, బదిలీలు సహజమని, ఏ స్థానంలో పనిచేసినా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ గిరిజనుల సంక్షేమానికి కృషి చేయడమే ఉద్యోగి నిజమైన సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏకు సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్)గా పదోన్నతిపై బదిలీ అయిన సున్నం రాంబాబుకు శనివారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో యూనిట్ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పీవో బి.రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. సుమారు రెండేళ్లపాటు ఐటీడీఏ పరిపాలన అధికారిగా పనిచేసిన రాంబాబు గిరిజనులకు తనవంతు సేవలందించారని ప్రశంసించారు. అంకితభావంతో పనిచేసి అనతికాలంలోనే పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం సున్నం రాంబాబు మాట్లాడుతూ.. రెండేళ్లపాటు భద్రాచలం ఐటీడీఏలో పనిచేసే అవకాశం కల్పించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పీవోతో పాటు ఇతర అధికారుల సహకారం, కార్యాలయ సిబ్బంది అందించిన



తోడ్పాటుతో గిరిజనులకు సేవలందించగలిగానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి సహకారం, స్ఫూర్తితోనే తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగానన్నారు. విధుల నిర్వహణలో తనవల్ల ఎవరైనా ఇబ్బందికి గురై ఉంటే మన్నించాలని కోరుతూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏటూరునాగారం ఐటీడీఏకు బదిలీపై వెళ్తున్న సున్నం రాంబాబును అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చందన, ఈఈ మధుకర్, ఏపీవో వేణు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, కొండారెడ్డి విభాగం అధికారి గన్యా, ఎల్‌టీఆర్ డీటీ మణిధర్, ఏడీఎంహెచ్‌వో సైదులు, పీఈటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, క్రీడల అధికారి గోపాలరావు, ఏసీఎంవో రమేష్, డీఎస్పో ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల తరహాలో భద్రాచలంలో భక్తులకు వసతులు కల్పించాలి

రామాలయ అభివృద్ధికి మరో రూ.2 వేల కోట్లు కేటాయించాలి

డిప్యూటీ సీఎం, మంత్రులు సమష్టిగా కృషి చేయాలి.. డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి



భద్రాచలం నవంబర్ 21 (జనంసాక్షి) : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు తిరుమల తరహాలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని టీఆర్ఎస్‌డీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రామాలయ సమగ్ర అభివృద్ధికి ఇప్పటికే కేటాయించిన రూ.400 కోట్లకు అదనంగా మరో రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో భక్తులకు అందుబాటులో ఉన్న విధంగా భద్రాచలం లోనూ వసతి గృహాలు, క్రమబద్ధమైన క్యూ లైన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మెరుగైన వసతి సముదాయాలను నిర్మించాలని పేర్కొన్నారు. పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ వద్ద అలిపిరి తరహాలో ఆకర్షణీయమైన ప్రవేశద్వారం ఏర్పాటు చేస్తే భద్రాచలానికి ప్రత్యేక శోభ చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రామాలయ అభివృద్ధి కేవలం దేవస్థానానికే పరిమితం కాకుండా భద్రాచలం ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈ దిశగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములుగా చేసుకోవాలని సూచించారు. 1/70 చట్టం పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించకుండా, చట్టపరిధిలోనే అవసరమైన పరిష్కారాలు చూపుతూ పనులను వేగవంతం చేయాలని కోరారు. భద్రాద్రి క్షేత్ర వైభవాన్ని మరింత పెంపొందించి, దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా సహకరించాలని డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆరోగ్య బీమాపై అవగాహన

- అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ రమావత్ చిరంజీవి

పి.ఏ.పల్లి,నవంబర్ 21 (జనంసాక్షి):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకంపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. శనివారం పి.ఏ.పల్లి మండలం అంగడిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు గ్రామ సర్పంచ్ రమావత్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి ధన్సింగ్ వెళ్లి పథకానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుతుందని వివరించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు ఈ పథకానికి అర్హులని,నమోదు కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారి వివరాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.ఈ పథకానికి సంబంధించిన ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉండాలని,అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య భద్రత పొందాలని సర్పంచ్ రమావత్ చిరంజీవి కోరారు.



బ్రహ్మోత్సవాల్లో హనుమత్ వాహనసేవ

వలిగొండ, నవంబర్ 21 (జనంసాక్షి)

మండలంలోని వెంకటాపురం మత్స్యగిరిశ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం హోమం, హనుమత్ వాహనసేవ, బలిప్రదానం, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ఈవో కొత్తపల్లి వెంకటయ్య, ధర్మకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

చింతపల్లి, నవంబర్ 21(జనంసాక్షి)

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చింతపల్లి మండల సీడీపీవో సక్కుబాయి సూచించారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలంలోని స్వయం సహాయక సంఘాల (ఎఊఉ) నాయకులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, డ్రగ్స్‌కు అలవాటుపడిన వారిని గుర్తించే లక్షణాలు, వారిలో కనిపించే మార్పులు, వారికి అందించాల్సిన కౌన్సెలింగ్ తదితర అంశాలను సక్కుబాయి వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజమ్మ, సుగుణ, ప్రసన్నలక్ష్మి, స్వయం సహాయక సంఘాల నాయకులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

ప్రకటించిన అలైన్మెంట్ ను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి గెలిచిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ గురించి అధికార పార్టీ నాయకులు ఎందుకు మాట్లాడలేదని అన్నారు.సూర్యాపేట పట్టణంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని అన్నారు.పట్టణంలో నెలకొన్న నీటి కొరతను కూడా తీర్చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షులు గండూరి శంకర్, నాయకులు సింగరికొండ సురేందర్, ఈగ వెంకటేశ్వర్లు,మొరిశెట్టి కోటేశ్వరరావు,వుల్లి రామాచారి, దూలం నగేష్, పాండురంగ చారి, దీకొండ శ్రీనివాస్,చకిలం రవిప్రసాద్, ఎలగందుల సుదర్శన్, తన్నీరు వాసుదేవరావు, ప్రదీప్ కుమార్, రాజేశ్వర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాలకు ఆర్థిక భరోసా జీవిత బీమా

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్

చింతపల్లి, నవంబర్ 21(జనంసాక్షి)

కుటుంబంలోని ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడంలో జీవిత బీమా ఎంతో కీలకమని చింతపల్లి గ్రామ సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఆర్థిక స్థోమతకు అనుగుణంగా జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు లేదా కుటుంబ పెద్దకు ఏదైనా ఆపద సంభవించినప్పుడు బీమా పథకాలు కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు జీవిత బీమా పథకాలపై అవగాహన పెంచుకొని, అర్హతలకు అనుగుణంగా ప్రభుత్వ, ఇతర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో బీమా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు.. ఈ



కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెహనా బేగం సిద్దిక్ బాబా, వార్డ్ సభ్యులు కందుకూరి శిరీష గిరి ,జక్కుల రమేష్ ,మొహమ్మద్ జాఫర్, గునుకుల మౌనిక నరేష్ , సిద్దె స్వామి, తదితరులు పాల్గొన్నారు...

కుటుంబాలకు బీమాతో ఆర్థిక భరోసా! ప్రతి ఇంటికీ జీవిత బీమా రక్షణ

చింతపల్లి , నవంబర్ 21(జనం సాక్షి)

కుటుంబ భవిష్యత్తుకు జీవిత బీమా భరోసాగా నిలుస్తుందని తీదేడు సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. శనివారం చింతపల్లి మండలం తీదేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవిత బీమాపై అవగాహన పెంచుకొని, అర్హతకు అనుగుణంగా బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ పెద్దకు ఆపద సంభవించినప్పుడు బీమా ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణగౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, సందె లక్ష్మయ్య, శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్, వీరమల్ల వెంకటయ్య, చింతకుంట్ల రాకేష్, మునగాల అశోక్, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





మాజీ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్

ఖమ్మం, (జనంసాక్షి) :

ఖమ్మం లోని నాలుగో డివిజన్ మాజీ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, ఆరో డివిజన్ మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటి తదితరులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కట్ చేయించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దండ జ్యోతి రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తంగిలపల్లి శ్రీనివాస్, మిరియాల రమేష్, కోలేరు సురేష్ కుమార్, తీగల సతీష్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువతి మృతికి కారణమైన కేసులో నలుగురు అరెస్ట్

రిమాండ్‌కు తరలించిన బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్

బూర్గంపహాడ్ నవంబర్ 21 (జనంసాక్షి)

ప్రేమ పేరుతో యువతిని నమ్మించి, పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను బూర్గంపహాడ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మండలంలోని చెరువు సింగారం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్సై మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. చెరువు సింగారం గ్రామానికి చెందిన చర్ప కవిత (20) అదే గ్రామానికి చెందిన సున్నం చరణ్‌ను ప్రేమించింది. అయితే కొంతకాలం ప్రేమ వ్యవహారం కొనసాగిన అనంతరం చరణ్ పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కవిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది.ఈ ఘటనపై మృతురాలి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపహాడ్ పోలీసులు సున్నం చరణ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా ప్రధాన నిందితుడు సున్నం చరణ్‌తో పాటు అతడికి సహకరించిన తల్లిదండ్రులు, అన్నయ్యను శుక్రవారం అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ వెల్లడించారు. ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లికి నిరాకరించిన ఘటన యువతి ప్రాణాలను బలిగొనడం స్థానికంగా కలకలం రేపింది.

రామాలయ నిర్మాణానికి బోరు,మోటారు విరాళం

- మాలదరణ రామ స్వాములకు అండగా నిలిచిన బోరు వేసి నీళ్ల సాయం అందించిన
- ఆదర్శ దంపతులు హాట్కర్ ఉమేష్ నాయక్ చంద్రకళ బాయి

కామేపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):

ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోగల గోవింద్రాల గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ రామాలయం నిర్మాణముకు అలాగే మాలదరణ రామస్వామిల అవసరాల నిమిత్తం ఏజెన్సీ ప్రాంతమైన గోవిం ద్రాల గ్రామ నివాసి అయిన ఉద్యోగి హట్కర్ ఉమేష్ నాయక్, చంద్రకళాబాయి దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆలయ నిర్మాణ పనులకు, భవిష్యత్తు అవసరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు సొంత ఖర్చులతో బోరు వేయించడంతో పాటు, మోటారును కూడా విరాళంగా అందిస్తామని గతంలో ఆలయ కమిటీకి వారు హామీ ఇచ్చారు.కమిటీ సభ్యులు కోరగానే ఏమాత్రం వెనుకాడకుండా ఉదార హృదయంతో స్పందించిన ఆ దంపతులు, అన్నమాట ప్రకారం బోరు వేయించి మోటారును సమకూర్చారు. దైవకార్యం పట్ల వారికి ఉన్న అంకితభావాన్ని, సేవానిరతిని గ్రామస్థులు ఘనంగా కొనియాడారు. ఆలయ నిర్మాణానికి వారు అందించిన ఈ మహత్తర సహాయం గోవింద్రాల గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొంటూ, శ్రీరామాలయ కమిటీ ప్రతినిధులు. బానోత్ దేవిలాల్. ఆలోత్ శివ నాయక్.భూక్య సోమ్లా నాయక్ తండా నాయక్.శ్రీ రామమాల ధారణ గురు స్వామి భూక్య భంగి. మల్యూర్.సుక్క బావాజీ. ఎలక్ట్రిషన్ చారి. గ్రామస్థులు. అలాగే విరాళ దాత ఉమేష్ నాయక్ చంద్రకళ బాయి దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.3.84 లక్షల నిధులు మంజూరు

మంత్రి తుమ్మల సహకారంతో పనులకు శ్రీకారం.. విద్యుత్ శాఖ అధికారులకు చెక్కు అందజేత

ఖమ్మం, నవంబర్ 21 (జనంసాక్షి)

46వ డివిజన్ సారధి నగర్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.3,84,856 మున్సిపల్ నిధులు మంజూరయ్యాయి.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నిధులు విడుదల కాగా, మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ చెక్కును విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు, అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల పొడిగింపు వంటి పనులు చేపట్టనున్నారు. గతంలోనూ డివిజన్‌లో రూ. 8.50 లక్షలతో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టగా, అధిక విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యువనేత తుమ్మల యుగంధర్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెకుముకి మండల స్థాయి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 14 విద్యాసంస్థల భాగస్వామ్యం

బూర్గంపహాడ్ నవంబర్ 21 (జనంసాక్షి)



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, విజ్ఞాన అవగాహనను పెంపొందించే లక్ష్యంతో బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని నడత పాఠశాలలో శనివారం చెకుముకి మండల స్థాయి పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని మొత్తం 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాల్గొని విద్యార్థుల ప్రతిభను చాటాయి. పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, సారపాక జిల్లా పరిషత్ పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో సెయింట్ థెరిసా పాఠశాల ప్రథమ స్థానం, సారపాక ప్రగతి విద్యానికేతన్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. గురుకుల పాఠశాలల విభాగంలో బూర్గంపాడు మైనారిటీ గురుకుల పాఠశాల ప్రథమ స్థానం, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. తెలుగు మాధ్యమ విభాగంలో బూర్గంపాడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షా కార్యక్రమాన్ని బూర్గంపహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. రవిలాదేవి ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు వీరభద్ర, బయ్యా రాము పర్యవేక్షణలో పరీక్ష నిర్వహణ జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞాన ప్రతిభను ప్రదర్శించారు.

ఢిల్లీ యువకుడికి అండగా నిలిచిన 'అన్నం ఫౌండేషన్'

- ❑ ఖమ్మం ఆర్పీఎఫ్ పోలీసుల సమక్షంలో ఢిల్లీ అధికారులకు అప్పగింత
- ❑ ఫౌండేషన్ సేవలను అభినందించిన ఆర్పీఎఫ్ సీఐ, ఢిల్లీ వెల్ఫేర్ ఆఫీసర్

ఖమ్మం, (జనం సాక్షి) :

ఇటీవల ఢిల్లీ నుండి తప్పిపోయి ఖమ్మం చేరుకున్న మతిస్థిమితం లేని యువకుడిని తిరిగి స్వస్థలానికి పంపేందుకు అన్నం ఫౌండేషన్ చొరవ చూపింది. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన దాము (20) అనే మతిస్థిమితం లేని యువకుడు ఇటీవల తప్పిపోయి ఖమ్మం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అతడిని గుర్తించిన ఖమ్మం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సీఐ సురేష్ గౌడ్, ఏఎస్ఐ షేక్ మోదినిషా ఆ యువకుడి సంరక్షణ నిమిత్తం ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. ఫౌండేషన్ నిర్వాహకుల సమాచారంతో శనివారం ఢిల్లీ నుండి విమానంలో ప్రత్యేకంగా ఖమ్మం చేరుకున్న వెల్ఫేర్ ఆఫీసర్ ఇజాజ్ అహ్మద్,



ఇతర సిబ్బంది అన్నం ఫౌండేషన్‌ను సందర్శించారు. ఆర్పీఎఫ్ సీఐ సురేష్ గౌడ్ సమక్షంలో, అన్నం ఫౌండేషన్ చైర్మన్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు ఆ యువకుడిని ఢిల్లీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇజాజ్ అహ్మద్‌కు సురక్షితంగా అప్పగించారు. అనాథలు, మతిస్థిమితం లేని వారికి ఆశ్రయం కల్పిస్తూ, వారిని తిరిగి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చుతున్న అన్నం ఫౌండేషన్ సేవలను, చైర్మన్ అన్నం శ్రీనివాసరావును ఆర్పీఎఫ్ సీఐ సురేష్ గౌడ్, ఢిల్లీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇజాజ్ అహ్మద్ ప్రత్యేకంగా అభినందించారు.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

ఖమ్మం రూరల్, నవంబర్ 21:(జనం సాక్షి)
బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఖమ్మం రూరల్ మండలం ఆరేంపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ ఐసిడిఎస్ సూపర్వైజర్ మాలతి హాజరయ్యారు .ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక దాడి ,అక్రమ రవాణా తదితర చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు . చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులను కోరారు. బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు .సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ విద్యార్థిని విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని కేవలం విద్య వలన మాత్రమే ఏదైనా సాధించగలమని అన్నారు .
ఐసిడిఎస్ సూపర్వైజర్ మాలతి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని , జంక్ ఫుడ్ ఫాస్ట్ ఫుడ్ వదిలివేయాలని తెలిపారు. పోషకాహారం వలన మానసిక శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని తద్వారా చదువుపై ఏకాగ్రత కుదురుతుందని అన్నారు.



బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ లైన్ 1098 కు ఫోన్ చేసి తెలపాలన్నారు .గ్రామ సర్పంచ్ బండి సతీష్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బాల బాలలందరూ క్రమశిక్షణతో ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలని ఉపాధ్యాయులు చెప్పే విషయాన్ని శ్రద్ధగా నేర్చుకొని గ్రామానికి జిల్లాకి మంచి పేరు తేవాలని హితవు పలికారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఆరెంపులగ్రామ ఉపసర్పంచ్ షేక్ దావూద్ ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరమణ , ఏఐడీ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ , ఐసిడిఎస్ సూపర్వైజర్ మాలతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ స్థలాన్ని ఇంచు కూడా వదులుకునేది లేదు

పాఠశాల పరిరక్షణకు పూర్వ విద్యార్థుల రౌండ్ టేబుల్ సమావేశం

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 21(జనంసాక్షి):
పాల్వంచ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థల పరిరక్షణకు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని, పాఠశాల స్థలాన్ని ఇంచు కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. శనివారం పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు రంగారావు విగ్రహం వద్ద పూర్వ విద్యార్థుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థి కొండపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు, పట్టణ ప్రముఖులు పాల్గొని పాఠశాల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1963 నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల్లో ప్రముఖులుగా ఎదిగేందుకు ఈ పాఠశాల పునాదిగా నిలిచిందన్నారు. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాలను సందర్శించడం దీని ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం కూడా అధిక సంఖ్యలో విద్యార్థులతో, మెరుగైన ఉత్తీర్ణత శాతంతో పాఠశాల కొనసాగుతోందని తెలిపారు.ఒకప్పుడు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాఠశాల స్థలం ప్రస్తుతం ఐదు ఎకరాలకు పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన స్థలాన్ని



పాఠశాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పాఠశాలకు తక్షణమే వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు.
సమావేశంలో చేసిన తీర్మానాలను సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు, జిల్లా మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యే కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు.. పట్టణ ప్రముఖులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, ఎస్.జె.కె. అహ్మద్, కాల్వ భాస్కర్, బండి వెంకటేశ్వర్లు, ముత్యాల రమణమూర్తి, కనగాల అనంత రాములు, వడ్లమూడి పూర్ణచంద్రరావు, నల్లమల వేణు, దాసరి నాగేశ్వరరావు, ఎం.డి. మంజూరు, ఎం.డి. మసూద్, స్టాలిన్, అమీరుద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వయ్య ఆశయాలను కొనసాగిస్తాం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య

కామేపల్లి, నవంబరు 21 (జనంసాక్షి):
సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సీనియర్ నాయకుడు,ప్రజా ఉద్యమాల సహచరుడు కామ్రేడ్ పగిడిపల్లి సర్వయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కొత్తలింగాల గ్రామంలో గల ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో కామేపల్లి?కారేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వయ్య సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు సర్వయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.?అనంతరం సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ, కామ్రేడ్ పగిడిపల్లి సర్వయ్య జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, ఎర్రజెండా పట్ల అచంచల విశ్వాసంతో పనిచేశారని కొనియాడారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని గుర్తుచేశారు. వయసు పైబడినా, అనారోగ్య సమస్యలు వేధిస్తున్నా పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. మేడే కార్యక్రమాలు, అమరవీరుల



సభలు,పార్టీ మహాసభలతో పాటు అనేక ప్రజా పోరాటాల్లో ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సర్వయ్య మరణం పార్టీకి తీరని లోటని, ఆయనలాంటి సాధారణ కార్యకర్తల త్యాగాల పునాదులపైనే కమ్యూనిస్టు ఉద్యమాలు నిలబడతాయని చెప్పారు.ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్,శివలింగం, ఎస్.కే. లాల్‌మియా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ,ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎడ్లపల్లి ఉపేందర్,కేలోతు లక్ష్మణ్,మండల నాయకులు వడ్డే వెంకటేశ్వర్లు, ధరావత్ సక్రు, జరుకుల రామ్‌సింగ్, వీరయ్య,రాజేష్, సక్రం,కృష్ణ,రాజు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

దివ్యాంగ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి

35 మంది దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ.. సర్టిఫికెట్ల ప్రదానం

ఖమ్మం రూరల్, నవంబర్ 21: (జనం సాక్షి)
దివ్యాంగులు, ముఖ్యంగా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఆర్‌డీఎస్, ఎనేబుల్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో 35 మంది దివ్యాంగులకు నిర్వహించిన పది రోజుల వ్యాపార నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.ఎస్ఆర్‌డీఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. శిక్షణ పొందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు అందేలా



దరఖాస్తులను సిఫారసు చేస్తామని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమిల మాట్లాడుతూ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధికి శాఖ తరఫున సహకారం అందిస్తామన్నారు.ఐకేపీ ఏపీఎం రాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పల్లెగూడెం గ్రామ సర్పంచ్ చుండూరు సృజన,ఎస్ఆర్‌డీఎస్ జీఎస్‌సీఓ ప్రతాప్ ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు, శిక్షణ పొందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

అన్నవాహికలో ఇరుక్కున్న నాణెం విజయవంతంగా తొలగింపు

భద్రాచలం నవంబర్ 21 (జనంసాక్షి)
భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ వైద్య నైపుణ్యాన్ని చాటుకున్నారు. అన్నవాహికలో నాణెం ఇరుక్కొని శ్వాస తీసుకోవడా నికి ఇబ్బంది పడుతున్న మూడేళ్ల బాలుడికి విజయవంతంగా వైద్య ప్రక్రియ నిర్వహించి నాణెంను తొలగించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సమర్థవంతమైన వైద్య సేవలు అందించి చిన్నారికి ప్రాణాపాయం తప్పించడంతో వైద్య బృందంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాచలానికి చెందిన పి. జైశ్వాల్ (3) ఆయాసంతో బాధపడుతూ శనివారం ఏరియా ఆసుపత్రికి వచ్చాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన



వైద్యులు బాలుడి అన్నవాహికలో నాణెం ఇరుక్కున్నట్లు గుర్తించారు. పరిస్థితిని గమనించిన వైద్య బృందం వెంటనే స్పందించి షార్ట్ జనరల్ అనస్థీషియా ఇచ్చి రిగిడ్ ఈసోఫాగోస్కోపీ విధానం ద్వారా నాణెంను విజయవంతంగా బయటకు తీశారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ నరేష్ శస్త్ర చికిత్స నిర్వహించగా, డాక్టర్ సుమ, డాక్టర్ మల్లేష్, నర్సింగ్ అధికారులు జ్యోత్స్న, శైలజ, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది ఖాజా, సాంబ, మల్లికార్జున సహకరించారు. ప్రభుత్వ వైద్యశాలలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది. చిన్నారికి సకాలంలో వైద్యం అందించి విజయవంతంగా నాణెంను తొలగించిన వైద్య బృందాన్ని పలువురు అభినందిస్తున్నారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మూడేళ్ల బాలుడికి అరుదైన వైద్య సేవలు

విశ్వశాంతి మహాయాగంలో భక్తజనులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు

కోదాడ టౌన్ నవంబర్ 21 (జనంసాక్షి); కోదాడ పట్టణంలోని వంటిపులి గోపయ్య గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ కాలచక్రం 93వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం యాగశాల అలంకరణ, యాగశాల ప్రవేశం కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు యాగశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో,పూలమాలలతో, మామిడి తోరణాలు కట్టి ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు.వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం శాస్త్రోక్తంగా జరిగింది.?అదివారం నుంచి ప్రథమ యాగశాలలో వివిధ రకాల హోమాలు, ప్రత్యేక పూజా క్రతువులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ మహాయాగ మహోత్సవానికి కోదాడ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు,భక్త మహాజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి,యాగంలో పాల్గొని తీర్థప్రసాదాలు,అన్నప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో యాగ కమిటీ నిర్వాహకులు, మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంలో ఇందిరమ్మ బీమా రూ.5 లక్షల పథకం ప్రారంభం

మధిర, నవంబర్ 21 (జనంసాక్షి):

మధిర మండలం కృష్ణాపురం (మునగాల) ఆదర్శ గ్రామంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా రూ. 5 లక్షల పథకాన్ని శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... ఇందిరమ్మ బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా రక్షణ కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం, అనుకోని విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరాగాంధీ ఆశయాలకు అనుగుణంగా పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు,డి ఎల్ పి ఓ రాంబాబు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి



విజయకుమార్,బ్లాక్ కాంగ్రెస్ సూరంశెట్టి కిషోర్, ఇన్చార్జులు అద్దంకి రవికుమార్, పులిబండ్ల చిట్టిబాబు, ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వేల్పుల చెంచయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్రావు, యూత్ కాంగ్రెస్ నవీన్ రెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, వెంకటాపురం సర్పంచ్ పరుచూరి హరినాథ్, వెంకటాపురం గ్రామ ఉపసర్పంచ్ రఘు, ఖమ్మంపాడు సర్పంచ్ బట్ట అంజనబాబు, అల్లినాగారం సర్పంచ్ కృష్ణకుమారి, కాజీపురం సర్పంచ్ అయేషా కమాల్, వార్డ్ మెంబర్ కత్తి భాస్కరరావు గుజ్జురవి జరపల రమేష్, జానీ జాకీర్ గొల్లమందల శీను, రాము పంచాయతీ సెక్రటరీలు గ్రామస్తులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

అజంతా మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఏపీఎం వెంకట్రామారావు

కామేపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):

కామేపల్లి మండల కేంద్రం రైతు వేదికలో అజంతా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సమాఖ్య అధ్యక్షురాలు కె.ఉషశ్రీ అధ్యక్షత వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఏపీఎం ఎం. వెంకట్రామారావు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, పొదుపులు, అంతర్గత రుణాల చెల్లింపులు,బ్యాంకు లింకేజీ,రుణాల సకాలంలో చెల్లింపు,మహిళల ఆర్థిక అభివృద్ధి,జీవనో ఉపాధి పెంపుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరించారు.సెర్ప్ ఆధ్వర్యంలో అమలవుతున్న కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల నిర్వహణ, రికార్డుల నిర్వహణ,ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీ పీఓ కె.ఉమా మాట్లాడుతూ చిన్నారు లందరికీ విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని,వారి భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మహిళలుగర్భిణులు బాలింతలు,చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ప్రతి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలను అరికట్టాలని, గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో



పాటు పిల్లలకు సరైన పోషకాహారం అందించాలని తెలిపారు. రక్తహీనత నివారణచిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య,ఆరోగ్య పరీక్షలు,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అంగన్వాడి సూపర్‌వైజర్లు టి.విజయలక్ష్మి,పి. వరలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. మండల సమాఖ్య కార్యదర్శి జర్పుల సరోజ,కోశాధికారి వీసం శ్రావణి,సీసీలు బి.చైతన్య, కె.పుష్పకుమారి ,కె.సరోజిని, వై.నాగమణి ,జె.శోభ, వై.ఉప్పలమ్మ,అకౌంటెంట్ సీహెచ్.కౌసల్య, వై.వంశీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగామహిళా సంఘాల అభివృద్ధి, సభ్యుల ఆర్థిక స్వావలంబన, మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ,ప్రభుత్వ పథకాల సద్వినియోగం కోసం సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం

○పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా
○మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్

కల్లూరు నవంబర్ 21(జనంసాక్షి)

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని జిడిబి పల్లి, హనుమాతండ గ్రామాలలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం నమోదు కార్యక్రమాన్ని మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శ్రీ లం కోటేశ్వరి కృష్ణారెడ్డి ,కమిషనర్ సాయి కృష్ణారెడ్డి లతోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి అట్టహాసంగా శనివారం ప్రారంభించారు . ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్, కమిషనర్ సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్నిప్రవేశపెట్టడం జరిగిందన్నారు.కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో భరోసానిస్తుందని, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబ భవిష్యత్తుకు



ఆర్థిక రక్షణ కల్పించడంలో కీలకంగా నిలుస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నమోదు కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు, మొబైల్ నంబర్ తదితర అవసరమైన వివరాలను సిద్ధం చేసుకుని సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంఘం రామకృష్ణ, జినుగు భాస్కర రావు, యాసాశ్రీకాంత్, జిల్లెల్లభాస్కర్ రెడ్డి, బొల్లం శంకర్ గౌడ్, నోటి కృష్ణారెడ్డి, ధరావత్ రవికుమార్, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మేఘన ఎంపిక

మద్దులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల బాలిక మేఘన కు స్థానిక ప్రజల అభినందనలు

కామేపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి): ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన మద్దులపల్లి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పొడుగు మేఘన రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మేఘన పాల్గొననుంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమేష్,పిటి అంజయ్య,బి.



రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ ప్రజా ప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు స్థానిక ప్రజలు మద్దులపల్లి మాజీ కబడ్డీ క్రీడాకారులు మేఘనను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం కుటుంబానికి ధీమా

○పేదవాడి జీవితానికి భరోసా సర్పంచ్, ఉప సర్పంచ్ లు
○కౌంటర్ల ద్వారా బీమా నమోదు : ఎంపీఓ వెంకటేశ్వరరావు
○దేశంలోనే గొప్ప సంక్షేమ పథకం ఈ బీమా పథకం: మండలాధ్యక్షుడు నవీన్

మణుగూరు, అక్టోబర్ 21 (జనం సాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జీవిత బీమా నమోదు కౌంటర్లను సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, ఎంపీ ఓ పల్నాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...





పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడానికి తీసుకువచ్చిన గొప్ప పథకం ఈ పథకాన్ని ప్రతి ఒక్క కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో బీమా నమోదుకు సంబంధించి నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు .కాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షేమమని భారత దేశంలోనే అతి పెద్ద సంక్షేమ పథకం అన్నారు.. సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పునాదని కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తుందని అన్నారు.

కావలసిన పత్రాలు:

ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) రేషన్ కార్డులో ఉన్న సభ్యుల ఆధార్ కార్డుల తోపాటు రేషన్ కార్డు వెంట తెచ్చుకోవాలి. ఇంటి యజమాని ఆధార్ కార్డు చరవాణి నెంబర్ లింక్ అయినా చరవాణి వెంట తెచ్చుకోవాలి... ఒంటరి మహిళా, వృద్ధులు రేషన్ కార్డులో సింగిల్ గా ఉన్న రేషన్ కార్డ్ దారులు తదుపరి ప్రభుత్వం ఇచ్చే గైడ్లైన్స్ ప్రకారం చేయబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు పిరునాకి నవీన్,వార్డు సభ్యులు వేర్పుల నరేష్, కొలపిన్ని మానస, బిరుదు రాజుల శ్రీదేవి, ఎస్కే కరిష్మా , పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ గణేష్ రెడ్డి, భాగం రవి తదితరులు పాల్గొన్నారు..

తాళ్లపెంట రిసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం గడువులోగా పూర్తి చేయాలి.
- సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలి
- రీసర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలి

పెనుబల్లి,నవంబర్ 21(జనంసాక్షి)
జిల్లాలో చేపడుతున్న రీసర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.శనివారం పెనుబల్లి మండలం తాళ్ళపెంట గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో సంబంధిత భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, రికార్డుల ప్రకారం సర్వే పనులు చేపట్టాలని తెలిపారు.రీసర్వే నిర్వహించే తేదీ, సమయం గురించి సంబంధిత రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని, తద్వారా భూముల హద్దులు, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వీల వుతుందని పేర్కొన్నారు.రైతులకు ముందస్తు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని, సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించిన పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అధికారులు అందించే సమాచారాన్ని రైతులు నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే



అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచాలని, ఏలాంటి అభ్యంతరాలకు అయిన గడువు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను డేటా ఎంట్రీ నమోదు చేయాలని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్వే బృందం, రైతులు, తదితరులు వున్నారు.



డిపిఆర్ఓకి టీజేఎఫ్ వినతి పత్రం

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 21 (జనంసాక్షి)
కేబుల్ న్యూస్ ఛానళ్లలో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు, సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి గౌస్ పాషా ను కోరారు. ఈ మేరకు ఆయన నీ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.రాష్ట్రంలోనిఇతర జిల్లాల్లో కేబుల్ న్యూస్ ఛానళ్ల రిపోర్టర్లకు ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసిన విషయాన్ని టీజేఎఫ్ నాయకులు డీపీఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా జిల్లాల్లో అమలవుతున్న విధానాన్ని పరిగణనలోకి తీసుకుని, తమ జిల్లాలోనూఅర్హత కలిగిన రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వారితో పాటు శాటిలైట్ చానల్ లో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్ల దరఖాస్తుల సైతం పెండింగ్‌లో ఉండటంతో సంబంధిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అక్రెడిటేషన్ కార్డుల జారీతో పాటు ఇటీవల అక్రెడిటేషన్ కార్డులు పొందిన ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డులు సైతం తక్షణమే మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించి హెల్త్ కార్డులు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.టీజేఎఫ్ నాయకులు లేవనెత్తిన అంశాలపై డీపీఆర్ఓ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న అక్రెడిటేషన్ కార్డుల మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీపీఆర్వో నీ కలిసిన వారిలో ఎలెక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి , జిల్లా నాయకులు వసం నాగయ్య, శ్రీధర్ శర్మ, కొమెర వెంకటేశ్వర్లు(కెవి), మందా మోహన్, మందుల ఉపేందర్, పిన్నెల్లి శ్రీనివాస్,సతీష్,కూరపాటి నరేష్ , మస్తాన్, ముక్కంటి, పెంటి వెంకటేశ్వర్లు, కిరణ్మయి,సంపత్ కుమార్ నాగ శేఖర్.మధు, శ్రీను,కేబుల్ చానల్ రిపోర్టర్లు నరసింహ, మోహన్, ఉపేందర్, శ్రీనివాస్, రమేష్, నరసింహారావు, అనిల్ కుమార్, లింగయ్య,భద్రం, గోపాల కృష్ణ, ఏ.సతీష్, ప్రభాకర్, మధు, జమలయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆర్థిక భరోసా



వలిగొండ, నవంబర్ 21 (జనం సాక్షి)
ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వలిగొండ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఈ సహాయం అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జానకిరాములు, పాశం సత్తిరెడ్డి, నూతి రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెకుముఖి ప్రతిభా పరీక్షలో మండల ఫస్ట్ శ్రీ ఆదర్శ

చింతకాని, నవంబర్ 21 (జనంసాక్షి)
చెకుముకి మండల స్థాయి ప్రతిభ పరీక్షలో చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయం విద్యార్థులు మండల ప్రథమ స్థానం సాధించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పందిళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష శనివారం నిర్వహించారు. ఈ మండల స్థాయి పరీక్షకు 15 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మందా నిరోష, 9వ తరగతి విద్యార్థి చక్కిలాల రాజేష్, 8వ తరగతి విద్యార్థి రౌతు శ్రీరంగధనుష్ లు మండల స్థాయి ప్రథమ స్థానం సాధించారు. విజేతలైన విద్యార్థులకు డి సి ఈ బీ కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, ఎంఈఓ సలాది రామారావు, పాఠశాల హెచ్ఎం దొండపాటి వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.



బాలికల భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

మధిర సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎన్. ప్రశాంతి

ఎర్రుపాలెం, నవంబర్ 21 (జనంసాక్షి):
బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎన్. ప్రశాంతి పేర్కొన్నారు.శనివారం మండలం కేంద్రం లోని గురుకుల బాలికల పాఠశాల- కళాశాలలో నిర్వహించిన న్యాయచైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆమె మాట్లాడారు. బాలల భద్రత, లైంగిక వేధింపుల నివారణ చట్టపరమైన అవగాహన కల్పించారు. బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పోక్సో యాక్ట్ -2012 గురించి వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని, లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, తీవ్రమైన లైంగిక నేరాలకు సంబంధించి చట్టంలో కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు.బాలికలు తమకు ఎదురయ్యే అసభ్య ప్రవర్తన, వేధింపులు, బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా తెలిసిన వ్యక్తులైనా, బంధువులైనా తప్పుగా ప్రవర్తిస్తే భయపడకుండా తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచితులతో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోరాదని వివరించారు.బాలికలకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు బాధితురాలిని నిందించ కుండా, ఆమెకు అండగా నిలవాలని, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిం చారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల నంబర్ 112 గురించి వివరించారు. తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు బాలికల సమస్యలను ఓపికగా వినాలని, వారికి భయరహిత వాతావరణం కల్పించాలని, బాలికల భద్రత అనేది కేవలం కుటుంబ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. "బాలికల భద్రతే సమాజ భద్రత, బాలికల



గౌరవమే దేశ గౌరవం" అని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వర రావు, చింతల గోపాల్, నంబూరి జనార్దనరావు, గంధం శ్రీనివాసరావు , పల్లపోతు కృష్ణారావు, ఎం సతీష్,వి మాధురితేజ, సందీప్, ఐసీడీఎస్ సీడీపీఓ జి కృష్ణశ్రీ , ఎస్ఐ రమేష్ కుమార్,స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి,కోర్ట్ సూపరింటెండెంట్ సురేంద్రమణి,లీగల్ సెల్ అథారిటీ నిర్వాహకులు సూర్య నారాయణ, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్స్ వెంకట్,సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో

ఎంవీ పాలెం విద్యార్థుల ప్రతిభ

మండల స్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం

ఖమ్మం రూరల్, నవంబర్ 21 (జనంసాక్షి)
ఖమ్మం రూరల్ మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఎం.వీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం మండలంలోని స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ పోటీల్లో జలగం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ఎంవీ పాలెం పాఠశాల విద్యార్థులు ద్వితీయ, పెద్దవేంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. ఎంవీ పాలెం పాఠశాల తరపున పోటీల్లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థిని కాశీమల్ల సుప్రియ, తొమ్మిదో తరగతి విద్యార్థి వీర్ల గణేష్, ఎనిమిదో తరగతి విద్యార్థిని శీలం అఖిల సమన్వయంతో ప్రతిభ కనబరిచి పాఠశాలకు ద్వితీయ బహుమతిని అందించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండమల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించి, వారి విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.





పిల్లల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సీడీపీఓ కృష్ణ శ్రీ

మధిర, నవంబర్ 21 (జనంసాక్షి):
మధిర ప్రాజెక్ట్ పరిధిలోని నిదానపురం పాఠశాలలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణ శ్రీ ముఖ్య అతిథిగా హాజరై పిల్లల హక్కులు, వారి రక్షణ, సంక్షేమం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణ శ్రీ మాట్లాడుతూ. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణతో పాటు సమాన అవకాశాలు పొందే హక్కు ఉందని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిదానపురం సర్పంచ్ వీ రత్నకుమారి గారు నిదానపురం పాఠశాల హెచ్ఎం సార్ అంగన్వాడీ సూపర్వైజర్ అన్నపూర్ణ గారు అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కడం హర్షణీయం

డీసీసీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం

పినపాక, నవంబర్ 21(జనంసాక్షి):



బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్గా పినపాక మండలానికి చెందిన తోలెం కళ్యాణిని నియమించడం పట్ల పినపాక మండల ప్రజల తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామని డీసీసీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక మండలానికి చెందిన మహిళకు బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్పర్సన్గా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ నియామకంతో పినపాక మండలానికి సముచిత గుర్తింపు లభించిందని తెలిపారు. తోలెం కళ్యాణికి ఈ పదవి కల్పించిన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకం పట్ల మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోలెం కళ్యాణి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండలానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శబరిమల యాత్రికులకు రైల్వే శాఖ సూచనలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 21 (జనంసాక్షి)
శబరిమల దర్శనానికి వెళ్లే అయ్యప్ప భక్తులకు దక్షిణ కోస్తా రైల్వే శుక్రవారం ఓ అలర్ట్ జారీ చేసింది. ఇందులో రైలు ప్రయాణాల్లో, అలాగే రైల్వే స్టేషన్లలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇందులో వెల్లడించింది.ముఖ్యంగా రైలు ప్రయాణాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారిని అప్రమత్తం చేస్తోంది.

కాబట్టి ఆయా చర్యల్ని తప్పనిసరిగా పాటించాలని రైల్వే అధికారులు అయ్యప్పలను కోరుతున్నారు.బిఅయ్యప్ప మాల వేసుకుని రైలు ప్రయాణాలు చేసే భక్తులకు అగ్ని ప్రమాదాల నివారణకు దక్షిణ కోస్తా రైల్వే పలు సూచనలు చేస్తోంది. ముఖ్యంగా రైళ్లలో, రైల్వే స్టేషన్లలో పాటించాల్సిన అగ్నిమాపక భద్రతా నిబంధనలను వివరిస్తూ ప్రత్యేక సూచనల్ని విడుదల చేసింది.
రైళ్లలో కర్పూరం వెలిగించడం, అగరబత్తులు, కొవ్వొత్తులు వాడటం, హారతి ఇవ్వడం వంటి చర్యల్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు రైల్వే తెలిపింది. అలాగే పెట్రోల్, కిరోసిన్, ఎల్పీజీ సిలెండర్లు, గ్యాస్ స్టౌవ్ లు, క్రాకర్లు, బాణాసంచా లేదా మండే పేలుడు పదార్థాలను తీసుకెళ్లకూడదని తెలిపింది.మొబైల్ ఛార్జింగ్ సాకెట్ల ద్వారా ఎలక్ట్రిక్ కెటిల్స్, హీటర్లు వంటి అనధికార విద్యుత్ పరికరాల వాడకంపైనా నిషేధం ఉందని పేర్కొంది. విద్యుత్ వైర్లు, ఫిటింగ్స్ లేదా ఇతర పరికరాలను తాకడం, వాటిలో మార్పులు చేయడం నిషిద్ధమని తెలిపింది.బిఅత్యవసర సమయాల్లో ప్రయాణికులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు వీలుగా డోర్లు, ఎమర్జెన్సీ ద్వారాల వద్ద ఖాళీ స్థలం ఉంచాలని కూడా సూచిస్తోంది.రైల్లో మంటలు లేదా పొగ కనిపిస్తే అప్రమత్తమై రైలు మేనేజర్, టీటీఈ, ఆర్పీఎఫ్ లేదా విధుల్లో ఉన్న ఇతర రైల్వే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరుతోంది.రైల్లో అగ్నిప్రమాదం జరిగితే అలారం చైన్ ఉపయోగించి రైలు ఆపాలని, అనంతరం ప్రమాద ప్రాంతానికి దూరంగా ఉండాలని సూచించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని, కదిలే రైలు నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ దూకరాదని తెలిపింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వే చట్టాల ప్రకారం గరిష్టంగా మూడేళ్ల వరకూ జైలుశిక్ష, జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించింది.

చిన్నారులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలి

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 21 (జనంసాక్షి)
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈరోజు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆర్.బి.ఎస్.కె బృందాలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. చిన్నారులలో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, రక్తహీనత మరియు ఇతర అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు.అలాగే, గుర్తించిన బాధిత



చిన్నారులను తదుపరి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలోని (జిల్లా సత్వర చికిత్స కేంద్రం) లేదా ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్.బి.ఎస్.కె మొబైల్ హెల్త్ టీమ్స్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



పేదల సొంతింటి కల సాకారం దిశగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ..!

తిరుమలాయపాలెం, (జనంసాక్షి) :
రాష్ట్ర ముఖ్యమంత్రి పతి గ్రామంలో ఇల్లు లేని పేదలకి పక్కా ఎల్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకెళుతున్న రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టా పంపిణీ కార్యక్రమాన్ని మండల కిసాన్ సెల్నాయకులు పత్తి నాగేశ్వరరావు తిమ్మక్కపేట గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. గుడిసెలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కిసాన్ సెల్ మండల నాయకుడు పత్తి నాగేశ్వరరావు అన్నారు. అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 21 (జనంసాక్షి)
తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ (హైదరాబాద్) ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా మైనారిటీ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఎలక్ట్రిక్ వెహికల్ స్కిల్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ (మహిళలు ఉ జనరల్), బేసిక్ కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, బేసిక్ కంప్యూటర్, డేటా ఎనలిటిక్స్, మెడికల్ కోడింగ్, బిల్లింగ్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు) అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా నవంబర్ 24వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9704003002 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగానికి రాజీనామా చేసి.. పట్టభద్రుల పక్షాన పోరాటానికి సిద్ధం

- ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు నా ప్రధాన ఎజెండా
- పాలనలో ఉద్యమకారులకు, నిరుద్యోగులకు అన్యాయం
- మూడేళ్లయినా కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్, పీఆర్సీ ఊసే లేదు
- గెలిపిస్తే మండలిలో మా గొంతుకనవుతా: ఎరుకల శ్రీనివాస్ గౌడ్

ఖమ్మం, (జనంసాక్షి) :
నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాధించుకున్న తెలంగాణలో గత పదేళ్లపాటు గడీల పాలన సాగిందని, ఉద్యమకారులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, వాలంటరీ రిటైర్డ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఆఈఓ) ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు, జీవితాలు పణంగా పెట్టి పోరాడిన వారికి ఏమీ ఒరగలేదనే బాధతోనే తన ఉన్నతోద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి
ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉన్న ఖమ్మం జిల్లా, స్వరాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై వెనుకబడిపోయిందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 80 శాతం ఆదివాసీ, గిరిజన విద్యార్థులు ఉన్నప్పటికీ, వారి ఉన్నత విద్య కోసం కనీసం ఒక్క యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన వెంటనే ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు అంశాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సకల జనులను గత పాలకులు మోసం చేశారని, బయ్యారం ఉక్కు పరిశ్రమను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఓట్లు దండుకున్న నాయకులు గెలిచాక ఆ ఊసే ఎత్తలేదని మండిపడ్డారు.

ఉద్యోగుల సమస్యలు, జాబ్ క్యాలెండర్‌పై పోరాటం
ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఉద్యోగులకు పీఆర్సీ (ఖఖీఅ) ప్రకటించడం లేదని, పాత పెన్షన్ విధానాన్ని (ఞఖూ) వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మొత్తం ఉద్యోగుల్లో సగం మందికి పైగా ఔట్‌సోర్సింగ్ విధానంలోనే పనిచేస్తున్నారని, వారికి వచ్చే అరకొర వేతనాల్లోనూ దళారులు కమిషన్లు దండుకోవడం దారుణమన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి, మనస్ఫూర్తిగా తనకు ఓటేసి గెలిపిస్తే శాసనమండలిలో వారి పక్షాన పోరాడే బలమైన గొంతుకనవుతానని ఆయన హామీ ఇచ్చారు.

కార్మిక హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలి

మేళ్లచెరువు జనంసాక్షి :
మేళ్లచెరువు మండల కేంద్రంలో సిఐటియు మండల సర్వసభ్య సమావేశం ప్రియాంక అధ్యక్షతన జరిగింది, ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కార్మిక నియమావళిగా తీసుకువచ్చి కార్మికుల నడ్డి విరిచే విధంగా ఉందని అన్నారు, దేశంలో శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులకు కనీస వేతనంగా నలభై రెండు వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు, కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అదాని అంబానీలకు అనుగుణంగా కార్మిక చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తే పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు,



ఢిల్లీలో జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లా నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, అంగన్వాడీ ఆశా గ్రామపంచాయతీ కార్మికులు సిమెంటు పరిశ్రమ కార్మికులు ఆటో కార్మికులు గ్రామీణ కూలీలు మధ్యాహ్న భోజన కార్మికులు తమ హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని అన్నారు, ఆటో కార్మికులకు సంవత్సరానికి పన్నెండు వేల రూపాయలు నిరుద్యోగ భృతి కింద ఇస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు.

ఈ సమావేశంలో సిఐటియు మండల సమన్వయకర్త వట్టేపు సైదులు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పెట్టగనుపుల ముత్యాలు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ బాలాజీ నాయక్ డి శ్రీను ఎం సైదులు వి సుధాకర్ చంద్రం సైదమ్మ ప్రకాష్ సంధ్య భూలక్ష్మి కుమారి మోషే నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వంటవార్పు కార్యక్రమం

సూర్యాపేట (జనంసాక్షి):
బుల్లెట్ ట్రైన్ సాధన సమితి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని రైతు బజార్ లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు అప్పం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జుట్టుకొండ సత్యనారాయణ,అప్పం శ్రీనివాసరావు, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కోకన్వీనర్ చలమల్ల నర్సింహ మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా రైలు రావాలని 40 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నా ప్రజాప్రతినిధులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. హైదరాబాద్ విజయవాడకు మధ్యలో ఉన్న సూర్యాపేట ప్రధాన వాణిజ్య కూడలి అని, ఈ మార్గం ద్వారా పోవడం వల్ల బుల్లెట్ ట్రైన్ కు ఆకుపెన్సి రేటు ఎక్కువగా ఉంటుందని అన్నారు.ప్రజల ఆగ్రహానికి గురికాకముందే అధికార, ప్రతిపక్ష పార్టీలన్ని పార్టీలను పక్కనపెట్టి ప్రజల అభీష్టం మేరకు ఈ ప్రాంతం కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకువచ్చి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా సాధించేవరకు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పెండెం చంద్రశేఖర్ , పెద్దిరెడ్డి రాజా, కుంట్ల ధర్మార్జున్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బూర మల్సూర్ గౌడ్, మిర్యాల గోపాలకృష్ణ, పులిపాటి వెంకటేశ్వర్లు, భీమనపల్లి వెంకటేశ్వర్లు, గండూరి రమేష్ , కడారి బిక్షం,దూలం నగేష్, కందాల భాస్కర్, మిట్టకోల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



బుల్లెట్ ట్రైన్ ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేయాలి

సూర్యాపేట(జనంసాక్షి):
సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనే ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యామా ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు పెండెం విజయ్ కుమార్, ఫార్మాసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముషం హరి పిలుపునిచ్చారు.బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పూల సెంటర్ లో సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించాలని అన్నారు.సూర్యాపేట మీదుగా జాతీయ రహదారి 65కు సమాంతరంగా మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను కొనసాగించేందుకు ప్రభుత్వాలు సహకరించాలని కోరారు.మనకు రావాల్సిన బుల్లెట్ ట్రైన్ ను కొందరు స్వార్థంతో పక్కదారి పట్టిస్తుంటే చూస్తూ నిర్లక్ష్యం చేసినట్లైతే కొన్ని దశాబ్దాల పాటు సూర్యాపేటకు రైలు మార్గం చూడలేమని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, మానసాని నాగేశ్వరరావు,యామ రామ్మూర్తి, నల్లకుంట్ల మోహన్, బొమ్మిడి మహేష్, పోతుగంటి వెంకటేశ్వర్లు, కలకోట లక్ష్మయ్య, తాప్సి గాంధీ,వెంపటి పురుషోత్తం,చల్లా సత్యనారాయణ,చామకూరి లింగయ్య, గజ్జి నవీన్ కుమార్, ముప్పిడి సుధాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సాయిగ్రామర్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన వేడుకలు

చిలుకూరు,నవంబర్ 21(జనంసాక్షి):
మండల కేంద్రంలోని సాయిగ్రామర్ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలతో మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా నేహా, ఆర్ జెడిగా ఉజ్వల, డిఈఓ గా వేదశ్రీ, ఎంఈఓ గా యశ్వంత్, హెచ్ఎం గా యశ్విత బాధ్యతలను స్వీకరించి ఒక రోజు పాఠశాలను



నడిపించారు. వారు మాట్లాడుతూ ప్రతిరోజు తాము చేసే అల్లరిని ఉపాధ్యాయులు భరిస్తూ తమకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడం ఎంతో కష్టమైన పని అని తాము తెలుసుకున్నామన్నారు. ఇకనుండి క్రమశిక్షణతో మెలుగుతామన్నారు. ఉపాధ్యాయులు తమను సొంత పిల్లలుగా విద్యాబుద్ధులు నేర్పి అభివృద్ధి పదంలో నడిపించడం తమ అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గవిని ఆంజనేయులు, ఉపాధ్యాయునులు దీప్తి, ఉమా,లావణ్య,ఇందిరా,ఇందు,త్రివేణి విద్యార్థులు, పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు కొండంత అండ

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత..

చండూరు, నవంబర్ 21 (జనంసాక్షి)
నిరుపేదలకు కొండంత అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. చండూరు మున్సిపాలిటీలో అనారోగ్య కారణంగా వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం నాడు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నందు మున్సిపాలిటీకి చెందిన 17 మంది లబ్ధిదారులకు గాను 6,66,000/- రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఐతరాజు మల్లేస్తులతో కలిసి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బుషిపాక వాసు, కోడి సుష్మా వెంకన్న, మొగుదాల వెంకన్న కో ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ, చేనే సహకార సంఘం డైరెక్టర్ జూలూరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

శంభు లింగేశ్వర స్వామి దేవస్థానానికి రెనోవేషన్ కమిటీ ఏర్పాటు

మూడేళ్ల పాటు కొనసాగనున్న కమిటీ.. 14 మంది సభ్యుల నియామకం

మేళ్లచెరువు జనంసాక్షి
మేళ్లచెరువు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఇష్టకామేశ్వరి స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానానికి ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితితో రెనోవేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



దేవాదాయ శాఖ ప్రతిపాదనల మేరకు ఈ కమిటీని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెనోవేషన్ కమిటీ చైర్మన్గా కందుల సురేష్ కమిటీ సభ్యులుగా కందుల కందుల రాజారావు, బారెడ్డి వెంకట్ రెడ్డి, ముదెం అంజిరెడ్డి, బుస్సా రామారావు, బానోతు లక్ష్మా, ముదెం శ్రీనివాసరెడ్డి, వరగాని నాగరాజు, బీసం రామసైదులు, సంగెపు రామకృష్ణ, మక్కా యలమంద, చిన్నపంగు దేవమణి, బేతా రవీందర్ రెడ్డి, వేముల వెంకటనారాయణ నియమితులయ్యారు. నూతన కమిటీ ఏర్పాటుపై భక్తులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు, దేవస్థాన రెనోవేషన్ పనుల వేగవంతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

రామన్నపేట, నవంబర్ 21 (జనంసాక్షి):
రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఆవనగంటి ఆగయ్య (75) అనారోగ్యంతో మృతి చెందాడు.ఈ విషయం



తెలుసుకున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎడ్ల మహేందర్ రెడ్డి,గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డితో అంత్యక్రియల నిమిత్తం ఆగయ్య కుటుంబ సభ్యులకు 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఎడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆగయ్య కుటుంబానికి తామందరం ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాశం సతీష్ రెడ్డి, పర్నె మాధవరెడ్డి, అవనిగడ్డ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

భువనగిరి, నవంబర్ 20 (జనంసాక్షి)

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే భవన సముదాయ ప్రాంగణంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ఎనబోయిన జహంగీర్ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మత్స్యకారుల ఐక్యత, హక్కులు, సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతికి సంఘాలు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంట నరసింహ ముదిరాజ్, జిల్లా నాయకులు సాధు విజయకుమార్, ఎనబోయిన ఆంజనేయులు, కుక్కదువ్వు సోమయ్య, ఇట్టబోయిన గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్, మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండు, తుమ్మల పాండు, మొలకల సత్యనారాయణ, బర్ల పోచయ్య, కొలుపుల పెద్ద కృష్ణ, ఉడత భాస్కర్, సామల శోభన్ బాబు, సామల భాస్కర్, పిట్టల రాములు, తుపాకుల సురేష్, పిట్టల కనకయ్య, పిట్టల నాగరాజు, పెంట వినయ్, బండి కృష్ణ, పోతరాజుల రవీందర్, పెంటబోయిన నాగరాజు, లింగాల బిక్షపతి, కొలుపుల సత్యనారాయణ, ఎనబోయిన చంద్రశేఖర్, కానుగుల కృష్ణమూర్తి, దుగ్యాల రవి, చింతకాయల రమేష్, చామకూర రమేష్, పులి వెంకటేష్, సాధు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయితీ కార్మికులు, ఆశా వర్కర్లు ఏఐటీయూసీలో చేరిక

చిలుకూరు,నవంబర్ 21 (జనంసాక్షి):

మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో ఆశా వర్కర్లు మరియు గ్రామ పంచాయతీ కార్మికులను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి ఏఐటీయూసీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్న దేశంలో ఏకైక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని సవరించి రూ.26,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి రూ.18,000 ఫిక్స్డ్ శాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కింద రూ.50 లక్షలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మోదుగు లక్ష్మి, షేక్ ఖలేద బేగం, గుగులోత్ కళావతి, మాలోతు దుర్గ,గ్రామ పంచాయతీ వర్కర్లు సైదాచారి, కోటయ్య, పొట్టి అంజమ్మ, మాతంగి నాగమ్మ, కొండా శ్రీలత, సైదా తదితరులు చేరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రేమిడాల రాజు, జెర్రిపోతులగూడెం గ్రామ సీపీఐ కార్యదర్శి కె. వెంకటయ్య, సీపీఐ మండల నాయకులు ఉద్దండు నారాయణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందించాలి : ఆర్డీవో సూర్యనారాయణ

చిలుకూరు, నవంబర్ 21 (జనంసాక్షి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్లైన్ నమోదు ప్రక్రియను అధికారులు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని కోదాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) సూర్యనారాయణ సూచించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్లైన్ నమోదు ప్రక్రియను ఆర్డీవో సూర్యనారాయణ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు విధానం, లబ్ధిదారుల వివరాల సేకరణ, ఆన్లైన్లో వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలు, అవసరమైన పత్రాలను పరిశీలించి నమోదు చేయాలని, సాంకేతిక కారణాలతో లేదా వివరాల్లో పొరపాట్లతో అర్హులకు పథకం అందకుండా ఉండకూడదని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న నేపథ్యంలో ఈ పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను నిర్ణీత సమయంలో పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిలుకూరు తహశీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు,ఆర్ఐ సీతయ్య,పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



సూర్యాపేట(జనంసాక్షి):

ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, ఓటు హక్కు, ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల జీఆర్ వివేకవాణి హైస్కూల్ లో ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్స్ రహిత భారతదేశం కోసం పథకం 2025లో భాగంగా జాతీయ న్యాయ సేవలు అధికారం ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.విద్యార్థులు చదువుతో పాటు, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ గుడిమళ్ల సంతోష్ శర్మ, ప్రిన్సిపాల్ గుడిమళ్ళ స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు.అంతకు ముందు పాఠశాల నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వాములవారి లింగోటం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చేవెళ్లి శివకృష్ణ

30 మంది సభ్యులతో మూడు బూత్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

చౌటుప్పల్ నవంబర్ 21(జనం సాక్షి)

గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ నూతన అధ్యక్షుడిగా చేవెళ్లి శివకృష్ణ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు.శనివారం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామ నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో ఆయనను ఎన్నుకున్నారు. ఇదే సమావేశంలో గ్రామంలోని మూడు పోలింగ్ బూత్లకు సంబంధించి మొత్తం 30 మంది సభ్యులతో నూతన బూత్ కమిటీలను కూడా ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నూతన కమిటీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.అనంతరం నూతన అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మండల, గ్రామ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి, గ్రామ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్ పిఏసిఎస్ చైర్మన్ మస్తాన్ బాబు, ఏఎంసి వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి అంజయ్య ఉప్పు భద్రయ్య సర్పంచ్ ప్రదీప్ జి బొడిగె ఆనంద్ గౌడ్,అర్థ వెంకట రెడ్డి జాల మల్లేష్ శేఖర్ గౌడ్ గుండు మల్లయ్య మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మందుల సామేలు



నూతనకల్ నవంబర్ 21 (జనంసాక్షి): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శనివారం నూతనకల్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.అలుగునూరు గ్రామపంచాయతీలో గ్రామ పంచాయతీ భవనము అంగన్వాడీ భవనములకు శంకుస్థాపనలు చేసి ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా యోజన పథకం ఆన్లైన్ నమోదును ప్రారంభించారు,దిర్శనపల్లి గ్రామంలో అంగన్వాడి భవనమును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బిక్కుమల్ల గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ యోజన బీమా పథకం ప్రారంభం అలాగే మహిళ సంఘాల వివో బిల్డింగ్ ప్రారంభోత్సవం చేయటం జరిగింది.వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని ఉచిత సన్న బియ్యం ఉచిత కరెంటు మహిళలకు ఉచిత బస్సు మహిళా సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాలను మరియు ఇటీవల చేయూత పెన్షన్లను కూడా అందించడం జరిగిందని ఇంకా అనేక సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఇస్తున్నందుకు చాలా గర్వకారణమని ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి ఎంపీడీవో సునీత తహసిల్దార్ శ్రీనివాసరావు సర్పంచులు కాస నరేందర్ యాదవ్ పాండవుల లింగయ్య మమత అనుప్ రెడ్డి,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు,డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వివిధ పార్టీల నాయకులు ఇరుగు కిరణ్ పసుల అశోక్ యాదవ్, బంటు బద్రి, బోల్క సైదులు యాదవ్, గోరంట్ల వెంకన్న, ప్రసాద్, సతీష్, బొల్లెపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి అలైన్మెంట్ ను కొనసాగించాలి



సూర్యాపేట(జనంసాక్షి):

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల బీఎన్ రెడ్డి విగ్రహం సమీపంలో యునైటెడ్ ట్రస్మా సూర్యాపేట ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూసూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల వాంఛ సూర్యాపేట రైలు కలను సాకారం చేసేందుకు బుల్లెట్ సాధన సమితి అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు.మొదట కేటాయించిన ప్రకారం సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలుగజేసుకుని సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ వచ్చేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, కుంట్ల ధర్మార్జున్, పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, ఫ్రైవ్ మెన్ కమిటీ సభ్యులు పగడాల ఉపేందర్ రెడ్డి, బిక్షపతి,వివిధ పాఠశాలల మేనేజ్మెంట్ వెంపటి అజయ్ కుమార్, సంతోష్, యామాకిరణ్, పచ్చిపాల వెంకన్న,సతీష్,రవి, శ్రీనివాస్, కృష్ణ, రమేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, రాజశేఖర్, భరత్, ఉపేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.